

# సర్మా

తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

పాత ఎయిర్‌బేగ్ బెంచీ మీద పెట్టుకుని కూచుంది సరమ్మ. బొంబాయి నుంచి తనతో వచ్చిన ఆడపోలీసూ, మగ పోలీసూ లోపల గదిలో ఎస్.ఐ.గారితో మాట్లాడు తున్నారు. సరమ్మ వెనక వరండాలో కూచునుంది.

ఆమె ఎదురుగా పోలీసుస్టేషను వెనక గోడ నానుకుని రెండు గదులున్నాయి. వాటి నెత్తిమీద చిల్లుల రేకులు. రేకుల మీద ఒత్తుగా ఎండుటాకులు. ఒకటి పాయిఖానా. ఆ విషయం తలుపు తీసి ఉండటం వల్ల ఆమె కళ్లకీ, గాలి పుణ్యమా అని ముక్కుకీ తెలుస్తూనే ఉంది. పక్కది స్నానాలగది అయుండాలి. ఉదయం తొమ్మిది దాటింది. తెల్లారుతూండగా రావలసిన రైలు. సరమ్మకి నిద్రలేక కళ్లు మంటగా ఉన్నాయి. కడుపులో ఏదో భయం, ఆందోళనా. భళ్లుమంటూ స్నానాలగది తలుపు తెరుచుకుంది. ఉలిక్కిపడి చూసింది సరమ్మ. లోపల్నుంచి గీరల డ్రాయరులో ఒక వ్యక్తి తల తుడుచు కుంటూ బయటపడ్డాడు. ఒళ్లంతా తడి. ఒంటిమీద గీరల లాగు ఎంతమాత్రం ఉపయోగంగా లేదు. తల దించుకుంది సరమ్మ. తలా, ఒళ్లూ సరమ్మవేపు నవ్వుతూ చూస్తూ తీరిగ్గా తుడుచుకున్నాడతను. కాసేపటికి ఆడపోలీసు వచ్చి సరమ్మని లోపలికి తీసుకెళ్లింది.

ఎగాదిగా చూశాడు ఎస్.ఐ. సరమ్మ నలుపనే చెప్పాలి. ఇరవై నుంచి పాతికలోపు ఎంతైనా ఉంటుంది వయసు. బొంబాయిలో దీదీ కొనిపెట్టిన చౌకబారు పంజాబీ దుస్తుల్లో ఉందామె. సన్నటి ముక్కూ, కోల ముఖం, చిన్నవైనా ఆకర్షణీయంగా ఉండే కళ్లూ కొంచెం ముద్దగా ముద్దుగా ఉండే కింది పెదవీ సరమ్మని బొంబాయి తీసుకెళ్లాయి.

"రెడ్డిపాలెం. ఊ... ఇంటికాడెవరున్నారు?"

"మా యమ్మండి."

"తిండి తిని మధ్యాహ్నం బస్సుకి పో. కానిస్టేబుల్ వచ్చి దిగబెడతాడు."

ఎస్.ఐ.ని భయంగా చూస్తూ తలూపింది సరమ్మ.

"ఎల్లు, స్నానం గట్రా చెయ్యి. మీ కోసవే కట్టిం చాం. ఇంటికెళ్లి తిన్నంగా ఉంటావా, ఏ లంజకొడకో రమ్మన్నాడని షికారెల్తావా?"

మాట్లాడలేదు సరమ్మ.

మొత్తానికి మధ్యాన్నం అన్నది సాయంత్రం అయింది. భోజనం చేసి సరమ్మ వెనకాల బెంచీ మీద పడుకుని నిద్రపోయింది. నాలుగు దాటుతుండగా ఉదయం ఎదురుగా నుంచుని ఒళ్లు తుడుచుకున్న పోలీసు పిర్ర మీద కొట్టి లేపాడు. చటుక్కున లేచిన సరమ్మకి ఒక్కక్షణం తనెక్కడుందో అర్థం కాలేదు.

బస్సులో కూచున్న తరవాత ప్రాణం లేచొచ్చింది. ఊరూ, అమ్మా గుర్తు రాగానే కళ్లలో నీళ్లు తిరిగాయి. కానిస్టేబులు వెనక సీట్లో కూచున్నాడు. మామూలుగా చీర కట్టుకుంది సరమ్మ. ఊరెళ్లగానే నాలుగు వీధులూ పరిగెత్తాలనిపించింది. నాగమ్మా, సీతా, 'సేసూ' జ్ఞాపకం ఒచ్చేరు. వాళ్లేం చేస్తున్నారో? అసలు నాగమ్మ తనతో రావలసిందే, ఆరోజు రాత్రి ఎందుకు రాలేదో. తన కెందుకు భయం వెయ్యలేదు? చల్లటి గాలి గుండె నిండా పీల్చుకుందామె. మూడు నెలల ఉల్లిపాయలు, పౌడరు, తాంబూలం, పాత పక్కబట్టలు, చెమటతో కలిసిన బ్రాందీ వాసనల జైలు నుంచి మళ్లీ పాలెం వెళ్తుంటే నమ్మశక్యంగా లేదు సరమ్మకి. వెనక సీట్లో కాపలా పోలీసు జోగుతున్నాడు.

"సాయంత్రం మా యావిణ్ని సినిమాకి పంపే స్తాను. రేపుదయం ఎళ్లకూడదేటీ నువ్వు!"

బస్సు స్టాండుకి వెళ్తూండగా అన్నాడతను. సరమ్మ మాట్లాడలేదు. సరమ్మకి అమ్మని చూడాలని ఉంది. ఊళ్లో అందరూ ఏవనుకుంటున్నారో! నాగమ్మ బాషా గురించి చెప్తేగాని ఊరందరికీ విషయం తెలీదు. కళ్లలో నీళ్లు తిరిగాయి సరమ్మకి. బొంబాయిలో ఉండగానే చాలాసార్లు చచ్చిపోదావనుకుంది. పద్మ లేకపోతే తను ఎప్పుడో చచ్చిపోయుండేది. విజయవాడ నుంచి పదేళ్ల కిందట సినిమాల్లో చేరదావని వెళ్లింది పద్మ. ముందు మద్రాసు వెళ్లింది. వెళ్లిన రోజు రాత్రే ప్రొడ్యూసరు తాగి గదిలోకొచ్చాడు. పద్మ చివరికి బొంబాయిలో తేలింది. ఎలా ఉందో పద్మ! తనకి సహాయం చేసిందని తెలిస్తే దీదీ బతకనివ్వదు. దీదీ దగ్గర దెయ్యంలాంటి ఇద్దరు మనుషులుంటారు. మనుషుల్ని చంపడం, సగం కాల్చడం, చీరడం వాళ్లకి ఎంతో ఇష్టం. సరమ్మకి ఇద్దరూ స్పష్టంగా కనిపించారు. ఉలిక్కిపడిందామె.

రెడ్డిపాలెం ట్రంకురోడ్డుకి దూరం. రోజుకి నాలుగు సార్లు అనిష్టంగా తారురోడ్డు దిగి ఎర్రమట్టి తెరచాపతో పాలెం వెడతాయి బస్సులు. సరమ్మ తల్లి నారమ్మ పొగాకు రోజుల్లో పొలంలో పని చేస్తుంది. నారమ్మ మొగుడు పొలం చేసేవాడు. సరమ్మకి అయిదో ఏడు రాగానే అతను ఆదెయ్య పెళ్లాన్ని లేవదీసుకుపోయాడు. ఆ పోవడం పోవడం మళ్లీ పాలెం పొలిమేరలు తొక్క లేదు. రెడ్డిపాలెంతో సహా అక్కడి ఊళ్లన్నీ మెట్ట వీపు మీద సూరీడు కాయల్లాంటివి. జ్ఞాపకం వచ్చి వర్షాలు పడితే తప్ప ఊరి చెరువూ నిండదు, వాళ్ల కడుపూ నిండదు. మెట్ట మొక్కల్లాగానే బతుకు. నిజానికి సరమ్మ తండ్రి వెళ్లిపోయిన కొద్దికాలానికి నారమ్మని ఇద్దరు ముగ్గురు బతిమాలుకున్నారు. ఎవరి పంచనీ చేరలేదు నారమ్మ. ఎవర్నీ రానివ్వలేదు. కూతుర్ని పెట్టుకుని పొలాల్లో, ఇటుక ఆవల్లో కాలక్షేపం చేసింది. ఎందుకో తెలీదుగాని నారమ్మకి కూతుర్ని చదివించాలని ఉండేది. అలాగే ఓరోజు స్కూలుకెళ్లి, 'దీనిక్కాత్తంత బడి చెప్పం'డని అడిగింది. సరమ్మకి కూడా స్కూలుకెళ్లడం బాగా నచ్చింది. ఉదయాన్నే ఇంత బువ్వతిని పలక తీసుకుని బడికి పోయేది. ఎనిమిదో ఏడు వచ్చేవరకూ బడి మానలేదు సరమ్మ. పలకమీద దిద్దిన అక్షరాల్నీ, అంకెల్నీ పొంగిపోతూ చూసుకునేది నారమ్మ. రోజుకో సారేనా పలక మీద అక్షరాలు చదివించుకునేది. ('లంజికనా').

ఓరోజు సాయంత్రం బడినుంచి ఇంటికి రాగానే శోకన్నాలు పెడుతూ మంచంమీద దొర్లుతోంది నారమ్మ. చుట్టూరా నాగమ్మ తల్లీ, 'సేసూ వాళ్లొదినా నారమ్మ కాలు గట్టిగా పట్టుకుని కట్టుకడుతున్నారు. ఏడుపు లంకించుకుంది సరమ్మ. గునపం తగిలి కాలు చితికిపో యింది. నాలుగో రోజుకి గాయం చీము పట్టింది. వారం తిరిగేసరికి సలుపుతోపాటు కాలు కింద పెట్టడం ఆమె వల్ల గాలేదు. సరమ్మ పలక అవతల పారేసి పనిలోకి వెళ్లిపోయింది. నారమ్మ పూర్తిగా కోలుకుని నడవడానికి నెలరోజులు పట్టింది. కూలి కెళ్లడం సరమ్మకి అలవా టయిపోయింది. మళ్లీ బడిమాట ఎత్తలేదు నారమ్మ. సరమ్మ ఎప్పుడు ఎలా ఎదిగిందో ఆమె కూడా చెప్పలేదు. ఎదగడం మాత్రం ఆమెకిష్టం అనిపించలేదు. ఒళ్లు దరిద్రంతో ప్రమేయం లేకుండా కలుపుమొక్కలా ఆరో గ్యంగా పెరగడం వల్ల ఎంత నష్టమో బొంబాయి వెళ్లక పూర్వమే ఆమెకి కొంతతెలుసు. వెళ్లిన తరువాత ఒళ్లంతా ఒక రకమైన చీదర పుట్టింది. ('సామ్ తక్ నహీ ఓగీ క్యా!')

అడుసులోంచీ, ఇటువ ఆవ వేడిలోంచీ, పొగాకు పొలంలోంచీ ఏదో జీవశక్తి ఆమెలో ప్రవేశించి విరగ కాసింది. 'సేసు' డబ్బుల్తో జీడి కొనుక్కుని చెరిసగం కొరుక్కుని బుగ్గన పెట్టుకుని బడినుంచి ఇంటికి రావ డమే సరమ్మకెప్పటికీ ఇష్టం. జీడిరోజులు వెళ్లిపోయా యని ఆమెకీ తెలియకపోలేదు. చవితికి ఓసారి ఊళ్లో సినిమా వేశారు. అర్ధరాత్రి ఇంటికి తిరిగొస్తూంటే నాయుడిగారబ్బాయి ఆపేశాడు. తప్పించుకోవడానికి తాతలు దిగొచ్చేరు. సరమ్మ నవ్వితే ఆమె కళ్లు కూడా నవ్వుతాయి. ఊళ్లో యువకులకీ, కొంతమంది పెద్దలకీ సరమ్మ జ్వరంలా సోకింది.

రెడ్డిపాలెంలో వరసాగ్గా రెండోఏడు కూడా చుక్క వర్షం పడలేదు. నీటిమబ్బులు ఓపిగ్గా ఊరుమీంచి దాటి పోయాయి. ఆకలి హోరులా సాయంకాలం ఎర్రటి గాలి దుమారాలు. కూలి నాలికి కొంతమంది కొంపలు వదిలి వెళ్లిపోయారు. ఉన్నవాళ్లు ఎక్కడికెళ్లాలో తెలీక ఉండిపో యారు. చెరువు ఎప్పుడో ఎండిపోయింది. ఊరంతనీ చెరువు పక్క బావి చాలాకాలం కాసింది. తల్లీకూతుళ్లకి ఒకపూట గడవడం కూడా కష్టమైపోయింది. నారమ్మ నత్తు అమ్మేసింది.

అనుకోకుండా సరమ్మకి పని దొరికింది. పాలెం పక్కగ్రామంలో రోడ్డు పన్లు మొదలయ్యాయి. ఆ ఊర్నుంచి బస్సు రోడ్డు వేస్తున్నారు. పాలెం నుంచి కూడా పదిజోళ్ల మందిని తీసుకున్నారు. పదిరోజుల పని. కూలిలో రోజుకి రూపాయి మేస్త్రీ వాటా.

"మళ్లీ గొడవా గిడవా ఒద్దు. నీకిష్టమైతే రా," అన్నాడు బాషా. బాషా మేస్త్రీ. నలభై అయిదేళ్లుంటాయి. బట్టతలా, కాయబారు శరీరం. అంత ఎండల్లోనూ ఎప్పుడూ నోట్లో సిగరెట్ వెలుగుతూంటుంది. ఓ చిన్న కాంట్రాక్టరు కింద మేస్త్రీ బాషా. పనులున్నా లేకపోయినా అతను పచ్చగా ఎలా ఉంటాడో ఎవరికీ తెలీదు. మొదటి రోజు పనిలోకి రాగానే నాగమ్మనీ, సరమ్మనీ కంట్లో వేసు కున్నాడు బాషా. సాయంత్రం తట్టలు పారేసి మొగాలు కడుక్కుంటుంటే 'మేస్త్రీగారు కేకేత్తన్నా'రని కబురొచ్చింది. ఇద్దరికీ గొంతెండిపోయింది. సరమ్మ ముందు తేరుకుంది. 'అందుకే అయుంటుంది ఎదవ,' అంది. మొత్తానికిద్దరూ రావిచెట్టు కింద మేస్త్రీగారి ముందు నిలబడ్డారు. నోట్లో సిగరెట్టు అవతల పారేసి లేచాడు బాషా.

'టీ నీళ్లు మిగిలిపోయాయి. తాగిపోండి.' మరో మాట మాట్లాడకుండా వెళ్లిపోయాడతను. రోజూ టీ నీళ్లు ఎందుకు మిగల్తున్నాయో, మధ్యలో రూపాయీ అర్ధా 'ఏహె ఉంచుకో' ఎందుకవుతున్నాయో బొంబాయిలో దిగిన మొదటిరాత్రిగానీ తెలీలేదు. పదిరోజుల్లో పన్లు అయిపోయాయి. మరో రెండురోజులు నీళ్లు జల్లడానికని ఇద్దర్నీ ఉంచేశాడు బాషా. ఆరోజు సాయంకాలం మామూలుగా టీ నీళ్లతోపాటు 'కొంచె టిఫిన్చెయ్యి,' అంటూ ఉదయం చేసిన ఇడ్లీలు అందించాడు బాషా. డబ్బులిచ్చి ఇద్దరినీ అడిగేడతను.

"మళ్లీ పనికి పిలుస్తా రండి."

"ఎందుకు రావండీ?"

"ఎగస్ట్రా ఈ పదీ ఉంచండి మీ రూపాయి వాటా నేను తీసుకోలేదు- అదీ."

సరమ్మా, నాగమ్మా ఇంచుమించు ఎగిరి గంతేశారు.

"ఒస్తావండి."

"అరె కూచోండి ఒక్కమాట."

తర్వాత అరగంట సేపు మాట్లాడేడు బాషా. రెడ్డి పాలెం అవతల ప్రపంచంలో డబ్బు గలవాళ్లెలా ఉంటారో సరమ్మకి తెలీదు. హైదరాబాదులో ఇంట్లో పన్లకి వెయ్యి రూపాయలిస్తారని అసలు తెలీదు. అంత డబ్బుకి అక్కడ పనివాళ్లు ఎలా కరవయ్యారో నాగమ్మకీ తెలీదు.

"బలవంతం ఏమీలేదు. మీ మీద నాకు నమ్మకం కలిగింది. అక్కడి వాళ్లది పంజాబీ కుటుంబం. అంటే ఢిల్లీ వోళ్లన్నమాట. మనకి తెలిసిన వాళ్ల ద్వారా అడిగేరు. మన తెలుగువాళ్లంటే ఆళ్లకి నమ్మకం ఎక్కువ. మంచి బట్టలు, తిండి మీ ఇష్టం."

"అయిబాబోయ్ అయిద్రాబాదంటే దూరం గాదేటండీ?" అంది నాగమ్మ.

"ఏం దూరం! రాత్రి బండీ ఎక్కితే ఉదయం హైద్రాబాద్".

"మా యమ్మ ఒప్పుకోదండి", సరమ్మ అనగానే నాగమ్మ కూడా తలూపింది. కాసేపు ఇద్దరూ మాట్లాడలేదు.

వాళ్లు ఏం ఆలోచిస్తున్నారో బాషాకి బాగా తెలుసు. తీరిగ్గా సిగరెట్టు వెలిగించి ముక్కులోంచి పొగ వదుల్తూ చెప్పేడతను.

"సరే ఒక పని చెయ్యండి. మీకు డబ్బు గావాలి. పనుల్లేవు. ఒక్క మూడు నెలలు హైద్రాబాద్‌లో ఉంటే చెరో మూడు వేలు, వాళ్లు ఇచ్చే బహుమతీ తీసుకుని వెనక్కి రావొచ్చు. ఇంట్లో వాళ్లు ఒప్పుకోరనుకో. రేపు ఇంటికి వెయ్యి రూపాయలు పోస్టులో పంపితే మీ యమ్మ అన్నీ మర్చిపోద్ది," నవ్వేడు బాషా.

సరమ్మ, నాగమ్మా కూడా నవ్వేరు. వెయ్యి రూపాయలు! సరమ్మ వంద రూపాయల నోటు రెండుసార్లు చూసింది. ఏభై నోటు అసలు చూడనేలేదు. ఇద్దరికీ గాలిలో వందనోటులా గుండెలు రెపరెపలాడేయి. "ఇంటికెళ్లి ఆలోచించండి. ఈ చాన్సు మళ్లీ రాదు. ఇది మాత్రం ఎవరితో అనకండి. ఎల్లుండి చీకటి పడగానే ఇక్కడికి రండి. ఇంట్లో జెప్పి రావాల్నంటే అయ్యే పని గాదు. ఇష్టం లేకపోతే ఇప్పుడే చెప్పండి. డబ్బు ఎవరికీ చేదుగాదు."

ఇంటికి మూడు కిలోమీటర్ల దూరం పది కిలోమీటర్లు నడిచారిద్దరూ. సరమ్మకి గాలి దుమారంలో ఎగిరిపోతున్న రావి ఆకులా అనిపించింది. మూడువేలు! బాషా మంచివాడే! ఒకసారి కూడా ఏవీ అడగలేదు. రాత్రి ఆమెకి నిద్ర పట్టలేదు. డబ్బు తీసుకుని ఇంటికి రాగానే ఏవేం చెయ్యాలో కాసేపు ఆలోచించింది. అమ్మకి తెలిస్తే పోనివ్వదు. బాషా చెప్పినట్టు హైద్రాబాదు వెళ్లగానే ఉత్తరం రాసి ముందు 'అడమాన్సు' వెయ్యి రూపాయలు పంపిస్తే ఏ గొడవా ఉండదు. మధ్యలో బాషా వస్తూనే ఉంటానని ఎలాగూ చెప్పేడు.

మధ్యాన్నం నాగమ్మ ఇంటికెళ్లింది. ఇద్దరూ చాలా సేపు గుసగుసలాడుకున్నారు. చీకటి పడగానే ఎవరి దారిన వారు వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. బాషా చెప్పినట్టుగానే పొద్దుపోయిం తరువాత రెండు చీరలు పాత

పేపర్లో చుట్టుకుని రావిచెట్టు కిందికి వెళ్లింది సరమ్మ. ఇల్లు దాటుతున్నప్పుడూ, ఊరు దాటుతున్నప్పుడూ ఆమె గుండె దడదడలాడింది. ఈదురుగాలి తోసుకెడుతున్నట్టు విసవిస నడిచిపోయింది. చెట్టు కింది చీకట్లో బాషా నోట్లో సిగరెట్టు ఎర్రగా మెరిసింది. ఎంత చీకటి పడ్డా నాగమ్మ రాలేదు. సరమ్మకి దడ ఎక్కువయింది.

కాసేపు చూసి బాషా అన్నాడు.

"దానికి అదుష్టంలేదు, పద."

సరమ్మ రైలు ఎప్పుడూ ఎక్కలేదు. చీకట్లో ప్రపంచం ఆవలి అంచుకి లాక్కువెడుతున్నట్టు రైల్లో ఆమె భయంతో కుంచించుకుపోయింది. దరిద్రం ఇచ్చిన తెగింపుతో, ఓపక్క కాళ్లు ఒణుకుతున్నా బొంబాయి ప్లాట్‌ఫాం మీద అడుగుపెట్టింది సరమ్మ. తీరా నుంచున్న తరువాత చుట్టూరా చూసేసరికి కళ్లు బైర్లు కమ్మేశాయి. గొంతులోంచి అతికష్టం మీద మాట పెగిలింది.

"ఐద్రాబాదేనా?"

"కాదు, బొంబాయి."

ఆ మధ్యాన్నం తరువాత బాషా కనిపించలేదు. ఆ రాత్రి ఆమె మీదకి బుసలు కొడుతున్న బ్రాందీ వాసనల్ని చీలుస్తూ సరమ్మ పెట్టిన కేక రెడ్డిపాలెం సుడిగాలి హోరులాంటిది. మూడోరోజుకి ఆమె ఒంటి మీద ఆమెకే చీదర పుట్టింది. వారం తిరిగే సరికి సరమ్మ కాలి కింద పడ్డ నేరేడు పండులాగైపోయింది.

బస్సు దిగి ఊళ్లోకి అడుగుపెట్టగానే వెర్రి హాయి అనిపించింది సరమ్మకి. వెనక్కి చూడకుండా ఇంటికి పరిగెట్టింది. ఆమెని తీసుకొచ్చిన పోలీసు తీరిగ్గా సిగరెట్టు వెలిగించాడు. సరమ్మకి అమ్మ తప్ప ఊళ్లో మనుషులెవరూ కనిపించకపోయినా పోలీసులతో బస్సు దిగ్గానే ఆమెను చాలామంది చూశారు.

('ఏటి నారమ్మ కూతురు గదా?')

పదిహేను నిముషాల తరువాత మళ్లీ బస్సు బయల్దేరే లోపల పోలీసు సభ తీర్చి సరమ్మ బొంబాయి యాత్ర గురించి వివరంగా తెలియజేశాడు. సరమ్మ ఇంటి చుట్టూ పేట ఆడా మగా అందరూ చేరారు. తల్లీ కూతుళ్లిద్దరూ అప్పుడే ఏడుపు ఆపేరు. కళ్లు తుడుచుకుంటూ నాగమ్మని చూసింది సరమ్మ. ఇద్దరూ కావలించుకుని మరోసారి ఏడిచారు. అందరూ ఏడవడం పూర్తయిన తరువాత మగాళ్లు మూడు నెలల నుంచీ వాళ్లకి అంతుపట్టని ప్రశ్న అడిగారు. సరమ్మకి నోట మాట రాలేదు. ఇంటికొచ్చిన తరువాత అందరికీ ఏం చెప్పాలో ఆలోచించలేదు. నారీనికేతన్ వాళ్లూ చెప్పలేదు. అందుచేత హఠాత్తుగా అడిగేసరికి ఆమెకి ఏం చెప్పాలో అర్థం గాలేదు.

"బొంబాయెల్లేను"

"బొంబాయే! ఎవరెవరెళ్లేరేటీ?"

"...నేనే. పని దొరుకుద్దని."

ఆశ్చర్యం నుంచి తేరుకున్న వాళ్ల ప్రశ్నలకు గుడ్లప్పగించి చూడ్డం మినహా ఏమీ చెయ్యలేకపోయింది సరమ్మ. రాత్రి చాలాసేపటివరకూ సభ సాగుతూనే వుంది. బొంబాయి పారిపోయి ఒకచోట పనికి కుదిరేనని చెప్పింది సరమ్మ. నాగమ్మ, 'ఇందీ ఎలగొచ్చిందే,' అనడిగింది. బొంబాయి అమ్మగార్ని మాతా అంటారనీ, అక్కడందరూ తనని 'సర్మా' అనేవోళ్లని వివరించింది సరమ్మ. నాగమ్మకి ఎప్పుడెప్పుడు రెండువేల గురించి అడుగుదామా అని ప్రాణం పీకుతోంది. భయం వేసి వెళ్లనందుకు సరమ్మ సంపద ఊహించుకుని ఈర్ష్య పడింది. మర్నాడు రహస్యంగా అడుగుదామని నిర్ణయించుకుని ఇంటికి వెళ్లిపోయింది నాగమ్మ. మర్నాడు నాగమ్మ అడగలేదు. సరమ్మ సతీసుమతి అయితే గొడవ ఉండకపోను, సూర్యుణ్ని శపించి తెల్లారగానే తగులడకని కూకలేసి ఉండేది. అటువంటి శాపాలేవీ తగలకపోవడంతో సూర్యుడు నిర్భయంగా ఉదయించాడు. ఉదయించిన కాసేపటికి ఊరు భగ్గుమంది. పోలీసు అక్కడి నుంచి ఊరికే పోలేదు. సరమ్మ అంతర్థానం వెనుక రహస్యం అంతా ఎండతోపాటు పాక్కిపోయింది. దీనికితోడు పదిగంటల బస్సులో తెలుగు పేపరు రానే వచ్చింది. ఊళ్లోకి వచ్చేది మూడు పేపర్లయినా వార్త గాలిలా వ్యాపించింది.

వెంకట్రాయుడు అరుగు మీద కూచుని పేపరు పైకి చదువుతున్నాడు. చుట్టూరా చిన్నాపెద్దా శ్రద్ధగా వింటున్నారు. బొంబాయిలో వ్యభిచార గృహం నుంచి సరమ్మ అనే రెడ్డిపాలెం అమ్మాయిని పోలీసులు నారీనికేతన్ వారి సహాయంతో ఎలా రక్షించారో చదివిందే చదువుతూ శ్రోతలందరికీ ఆశ్చర్యం పంచుతున్నాడు రాయుడు.

"నారమ్మా! ఇలా నువ్వు, అరిజంటు", అటుగా వెడుతున్న నారమ్మని ఎవరో పిలిచేరు.

"సరమ్మ బొంబాయిలో ఏం జేసిందో ఎరుగుదువా!"

నారమ్మకి ఒళ్లు మెల్లిగా కాల్తున్నట్టనిపించింది. పరుగున ఇంటికెళ్లి కూతుర్ని పట్టుకుని బాదింది. మట్టి

గోడకి తల బాదుకుంది. ఆ క్షణం నుంచి ఊరు ఆక లేసిన కొండచిలువలా సరమ్మని చుట్టుకోవడం ప్రారం భించింది. ఊళ్లో తల్లీకూతుళ్లకి ఎవరెదురుపడ్డా పిలిచి పలకరించి మరీ అడుగుతున్నారు.

మర్నాటి నుంచీ నారమ్మ మాట్లాడ్డం మానేసింది. సరమ్మకి తను చేసిన తప్పేమిటో అర్థంగాలేదు. ('ఒళ్లమ్ముకున్నావంటగా, ఛీ!') మనిషిని నమ్మి ఊరు దాటడం తప్పే. పనిప్పిస్తానని నమ్మించి ముండల కొంపలో అమ్మేస్తే తనేం చేయగలదు! తనెంత ఏడిచి మొత్తుకుందో వీళ్లకెలా తెలుస్తుంది? ఎంత మాట్లాడ దావని ప్రయత్నించినా తలతిప్పేసుకుంటోంది నారమ్మ. సరమ్మ ఏం చెప్పినా ఎవరూ ఇప్పుడు నమ్మరని ఆమెకు తెలుసు. తను ఆ రాత్రి వెళ్లనందుకు వెయ్యి దేవుళ్లకి దణ్ణాలు పెట్టింది. నాగమ్మ తప్ప అందరూ తనతో మాట్లాడుతున్నా వాళ్ల చూపులూ, మాటా కొత్తగా అని పిస్తున్నాయి సరమ్మకి. ముఖ్యంగా ఆమెను చూడగానే పలకరింపుగా నవ్వడం మానేశారు. ఊళ్లో యువకులు సరమ్మ వేపు ఆశగా చూసేవారు. సరసాలాడేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. నారీనికేతన్ వాళ్లిచ్చిన రెండొందల రూపాయలతో ఇల్లు దాటకుండా కొన్నాళ్లు గడిచింది. నారమ్మ ఆ డబ్బు ముట్టుకోవడానికి ఒప్పుకోలేదు. ఒళ్లమ్ముకొచ్చిన డబ్బుతో కూడు తినే కన్నా చావడం నయమంది. సరమ్మ ఏడిచి గోలపెట్టి, లక్ష ఒట్లు వేసిన తరువాతగానీ నమ్మలేదు.

పొలం పనులు మొదలయ్యాయి. కూలికి వెళ్లడం మొదలుపెట్టింది సరమ్మ. రోజూ కడుపునిండా ఏడుపుతో ఇంటికి తిరిగొచ్చేది. ఒచ్చి పదిహేను రోజులు దాటు తున్నా సరమ్మ ఊళ్లో పాతబడలేదు. ఒకరోజు ఇంటి కొస్తుంటే వెంకట్రాయుడు ఎదురొచ్చి కన్నుగీటేడు.

"బొంబాయోళ్లు తప్ప మేం పనికిరాలేదన్నమాట. సూద్దాగాని రాత్రి రానా?" అంటూ చనువుగా భుజం మీద చెయ్యి వేశాడు. సరమ్మకి భయం వేసింది. మూడు నెలల క్రితం ఆమె కళ్లతో వాడిగా సమాధానం చెప్పి వెళ్లిపోయి ఉండేది. వెంకట్రాయుడి చెయ్యి జారేలోగా సరమ్మ తప్పించుకుని వెళ్లిపోయింది.

పొయ్యి మీద అన్నం పడేసి ఎదురుగా కూచుని ఎగసం తోస్తూ కళ్లనీళ్లు పెట్టుకుంది సరమ్మ. మగా, ఆడా అందరూ ఏడిపించేవాళ్లే. స్నేహితురాళ్లు మాటవరసకి కబుర్లు చెప్పినా మెల్లిగా బొంబాయి కబుర్లలోకి దించు తారు. ('ఒక్కోడూ ఎంతిత్తాడే? డబ్బేం జేసేవూ?') మూడు నెలల అజ్ఞాత జీవితంలో ప్రతి నిమిషం గురించీ వివరంగా చెప్పందే వాళ్లకి తృప్తిలేదు. ఓరోజు ఏడుపు ఆపుకోలేక మొదటి మూడురోజులూ తనని ఎలా వాడు కున్నారో కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పింది. 'సేసు' కళ్ల ముందు సరమ్మ నగ్నంగా నలుగురు మొగాళ్లతో కనిపిం చింది. ఆసక్తితో ఆమె కళ్లు పెద్దవయ్యాయి. రహస్యంగా గొంతు తగ్గించి ఏవేవో అడిగిందామె. సరమ్మకి గుండె బరువు తగ్గలేదు. ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది. ('అయన్నీ ఎందుకు?') కాసేపు చూసి మూతి తిప్పు కుంటూ వెళ్లిపోయింది 'సేసు'. కానీ తనని మోసం చేసి బొంబాయి తీసికెళ్లింది ఎవరో ఎందుకు చెప్పలేదో సరమ్మకే తెలీదు. ఆ రాత్రి పద్మ జ్ఞాపకం వచ్చింది. పద్మ ఎంత మంచిది. దీదీ దెయ్యం. మనుషులంటే పద్మకి భయంలేదు. పద్మకి ఏ అపకారం జరక్కుండా చూడ మని కోటసత్తెమ్మకి దణ్ణాలు పెట్టుకుంది సరమ్మ. ఒళ్లు పిండి అయిపోయి బొంబాయిలో నిద్రపోయే ముందు ప్రతి రాత్రీ ఊరు జ్ఞాపకం వచ్చేది సరమ్మకి. రాత్రి తెల్లారేలోగా పొలెంలో పడితే ఎంత హాయిగా ఉండుననుకునేది. ఇప్పుడు పల్లె హాయిగా లేదు. బయటికి రావాలంటే బెరుగ్గా ఉంది. ఇదివరకు సరమ్మ చెలికత్తెలతో సహా రావిచెట్టులా గలగల్లాడుతూ నవ్వుతూ ఉండేది. మహానగరంలో దీదీ మాంసం దుకాణంలో ఆమెనావరించిన ఒంటరితనం, భయం పొలెంలో కూడా ఆమె చుట్టూరా చేరేయి. రాత్రి పడుకునే ముందు తెల్లవారకుండా ఉంటే బాగుండుననిపిస్తోంది.

పది గంటల వేళ బస్సుదిగి, బట్టలు దులుపుకుని మెళ్లో కెమేరా, భుజాన సంచీతో ఒక వ్యక్తి సిగరెట్టు కొంటూ సరమ్మ గురించి అడిగేడు. దారి వెతుక్కుంటూ ఊళ్లోకి వస్తున్న అపరిచితుణ్ని అందరూ ఎగాదిగా చూస్తున్నారు. కొందరతనితో నడుస్తూ మాట్లాడు తున్నారు. వెంకట్రాయుడు ఓ కుర్రాణ్ని ఆపి అడిగేడు.

"ఎవర్రా ఆయన."

"నారమ్మ కూతురి గురించి పోటోలు తీసి రాత్తా డంట." పదిమందీ గుంపుగా నారమ్మ ఇంటికి చేరేరు. సరమ్మ పనిలోకి వెళ్లలేదు. తలుపు తీసి చూసి నిర్ఘాంత పోయిందామె. ఎవరో నులక మంచం వాల్చి అపరిచి తుణ్ని కూచోపెట్టేరు. గొంతు సవరించుకుని అన్నా డతను.

"నీ గురించి పత్రికల్లో చూశాను. నేను రాజ మండ్రిలో ఓ పత్రికలో పని చేస్తున్నాను. నీతో ప్రత్యేకంగా మాట్లాడి రాద్దామనుకున్నాను. ఇటువంటి అన్యాయం ఇతర్లకి జరక్కుండా ఉంటుంది."

"ఏంటంటే సరమ్మా, అసలు బొంబాయి ఎల గెల్లేవు, ఆడ ఏం జరిగిందీ రాత్తారన్నమాట,' ఓ కుర్రాడు వివరంగా వ్యాఖ్యానించాడు.

సరమ్మ చేతులు వణుకుతున్నాయి. హఠాత్తుగా అక్కణ్నుంచి మాయమైపోవాలనిపించింది. వాళ్లేం మాట్లాడుతున్నారో ఆమెకి వినబడ్డం లేదు. కెమేరా సరి చేసుకుంటూ మళ్లీ అతనే అన్నాడు.

"ఒక్కసారి ఆ గడపమీద కూచో. నీకు అభ్యంతరం లేకపోతే ఫొటో తీసుకుంటాను. తరువాత మాట్లాడుకుందాం."

నోట మాట రాలేదు సరమ్మకి. పదిమందీ పడగలు విప్పుకున్న పాముల్లా కనిపించారామెకి. ఒక్క గెంతులో లోపలికి వెళ్లి ధడాల్న తలుపు వేసింది సరమ్మ. పది నిమిషాలు చూసి ఓసారి తలుపు తట్టి నిరుత్సాహంగా వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికొస్తూనే తిట్లు మొదలుపెట్టింది నారమ్మ. వినీ వినీ ఎదురు తిరిగింది సరమ్మ.

"ఏం, సావమంటావా? ఒచ్చినప్పట్నించీ చూస్తున్నాను. చంపుకు తినేస్తన్నావు. నీగ్గాని ఇష్టం లేకపోతే చెప్పు, పోతాను."

"తిరుగుబోతు ముండవి పోకేం జేత్తావు? పైగా సావమంటావా అని అడిగేదానివా? సావరాదంటే? లంజరికం జేసి ఊళ్లో కెలగొచ్చేవే?"

సరమ్మకి ఎక్కడలేని ఉక్రోషం పొంగుకొచ్చింది. గట్టిగా అరుస్తూ ఏడుపు లంకించుకుంది. నారమ్మ అందుకుంది.

"ఏం నే సావలేదనా ఎదవేడుపు! సచ్చేనా పోలేదు. మీ అయ్య ఆ టెంపరిముండతో చచ్చేడు. నువ్వు ముండలకొంపలకి తిరిగొచ్చేవు. ఎదవకానా. పేణం పోయినా ఒక్కడికి లొంగలేదు. నిన్ను పండబెట్టి కూడు తింటున్నానని కూస్తన్నారే కొడుకులు పో, ఏడన్నా దూకి సావు."

కసికొద్దీ కూతురు జుట్టు పట్టుకుని ఊపేసింది నారమ్మ. గుంజుకుంటూ కెవ్వుమంది సరమ్మ. దాంతో నాలుగు బాదింది తల్లి. ఏడుపులకీ, అరుపులకీ, తిట్లకీ నలుగురూ కూడేరు. తల్లీకూతుళ్లని విడదీశారు. ఇద్దరూ చెరో మూలా శోకన్నాలు మొదలుపెట్టారు.

ఊళ్లో కన్నా ముందే ఇంట్లో చీకటి అలుముకుంది. నారమ్మ లేచి ముక్కు చీదుకుంటూ దీపం వెలిగించింది. నారింజ రంగు లేత వెలుగు బుడగలా ఇంట్లో కదుల్తోంది. చాప మీద ముడుచుకు పడుకుంటూ నారమ్మ అంది.

"దీపం ఎట్టగానే చూశాను ఎదవ మొకం."

సరమ్మ గుండె కెవ్వుమంది. కడుపులోంచి తన్నుకొచ్చింది ఏడుపు. తల్లి తనని ఏవగించుకోడం అన్యాయం అనిపించింది. పొయ్యి జోలికి వెళ్లలేదు నారమ్మ. కూచున్నచోటే మగతనిద్రలోకి జారింది సరమ్మ. తను పద్మ ఒళ్లో పడుకుని ఏడుస్తున్నట్లు కలొచ్చింది. మెల్లిగా తల నిమురుతూ మళ్లీ ఎందుకొచ్చావంటోంది. పద్మ నడుం చుట్టూ చెయ్యివేసి గట్టిగా పట్టుకుంది సరమ్మ. మెలుకువ వచ్చేసరికి దీపం ఒత్తి పొగలు కక్కుతోంది. నారమ్మ గుర్రు పెడుతోంది. నోరు తెరిచి గురక పెడుతున్న తల్లివేపు చూస్తూ కూచుందామె. దీపం పెట్టగానే తన 'ఎదవ మొకం' చూడగూడదన్నమాట. తనకీ 'ముండలకీ' తేడా ఏవుంది? మెల్లిగా లేచింది సరమ్మ. చీకట్లో సగం చిరిగిన దేవుడి పటానికి దణ్ణం పెట్టింది. తలుపు తీసుకుని బయటపడి నిద్రలో ఉన్న గ్రామం జ్వరం నాడిలా విసవిస చెరువువేపు నడిచిందామె. చెరువు నల్లగా ఎండిపోయింది. గట్టు కింది బావి దగ్గరికి నడిచింది సరమ్మ. రెండు చేతులూ బావి గట్టు మీద పెట్టి లోపలికి చూసిందామె. చీకటి లోతులు తప్ప నీళ్లు కనిపించడం లేదు. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. గట్టుమీద సగం కూచుని మళ్లీ చీకటి బావిలోకి చూసిందామె. కళ్లు గట్టిగా మూసుకుని లోపలికి దూకుదావని కాళ్లు ఎత్తబోయింది. కదలలేదు కాళ్లు. ఎక్కడలేని భయం పుట్టుకొచ్చింది. గుండె డప్పులా మోగడం ఎక్కువైంది. ఒళ్లు చమటపట్టింది. చావడం ఆమె వల్ల కాలేదు. బావి గోడ నానుకుని కూలబడి కసిగా జుట్టు పీక్కుని, నెప్పికి ఏడుస్తూ కూచుంది సరమ్మ.

తరువాత రెండు రోజులూ ఆమె పన్లోకి వెళ్లలేదు. నారమ్మ ఇద్దరికీ తిండి వండి తన మానాన తాను రెండు మెతుకులు తిని వెళ్లిపోయింది. ఆరోజు మధ్యాహ్నం దీపానికి వత్తి ఎక్కిస్తూ కూచుంది సరమ్మ. తలుపు దగ్గర అలికిడైతే తలెత్తి చూసింది.

"ఏం చేత్తన్నావే?" అంటూ లోపలికొచ్చింది నాగమ్మ.

సమాధానం చెప్పకుండానే వత్తిని చూస్తూ ఉండిపోయింది సరమ్మ.

"ఓసోస్, కోపవేటీ?"

"నేనెవుత్తినీ నీ మీద కోపం పడ్డానికి?"

"పోన్లే... ఏటి కబుర్లు! నిన్న నీ పెండు కనిపించాడెరుగుదువా?"

"అంటే?"

"బాషా!"

ఝల్లుమంది సరమ్మ ఒళ్లు. బాషా!

"ఓపాలి చూసొత్తావేటీ?" గలగలా నవ్వి వెళ్లిపోయింది నాగమ్మ.

నాగమ్మ బుర్ర బద్దలు కొట్టాలనిపించింది సరమ్మకి. ఉక్రోషం ముంచుకొచ్చింది. ఒంటిచెక్క తలుపు విరిగిపోయేటట్టు భళ్లున తలుపు వేసిందామె.

"నిన్ను కూకోబెట్టి ఒండి ఓర్చడానికి నీ బాబు ఒరిచేను పొలం ఇచ్చేడనుకున్నావా?"

సాయంకాలం శాపనార్థాలతో ఇంట్లో అడుగు పెట్టింది నారమ్మ. తిట్టి తిట్టి అలిసిపోయి గుక్కెడు నీళ్లు తాగి కూచుందామె. గుడ్లప్పగించి ఆమెవేపు చూస్తూ ఉండిపోయింది సరమ్మ. కాసేపయింతరువాత పొయ్యి రాజెయ్యడానికి లేచింది నారమ్మ. సరమ్మ దీపం వెలిగించి బయటికి వెళ్లింది. చీకటి పడిపోయింది. వంటల పొగవాసనలు తగులుతున్నాయి. లోపలికొచ్చి ఖాళీ సత్తుబిందె తీసుకుని బావి దగ్గరికి బయలుదేరిందామె. మరో బిందె నిండా నీళ్లున్నాయి. నిజానికి నీళ్లు మోసే ఓపిక కూడా లేదు. దగ్గరి దారి ఒదిలేసి చుట్టూరా తిరిగి బావి దగ్గరికి వెళ్లిందామె. బావి దగ్గర ఎవరూ లేరు. గట్టు నానుకుని కూచుంది సరమ్మ. ఊరవతల హాయిగా ఉంది. చల్లగా ఉంది. లేచి వెళ్లాలనిపించడం లేదు తనకి. మొన్న రాత్రే బావిలో దూకి ఉంటే హాయిగా ఉండేది. ఇన్ని రోజుల్నించీ ఒక్కరేనా తన గురించి పాపం అనుకోలేదు. చీకటి బావిలోంచి నీరు ఉబికినట్టు ఆమెకి దు:ఖం పొర్లుకొచ్చింది. చాలాసేపు ఏడుస్తూ కూచుండిపోయింది.

"అమ్మయ్య కరెట్టుగా దొరికేవు. నువ్వా, కాదా అని చూస్తన్నాను."

ఉలిక్కిపడింది సరమ్మ. ఎదురుగా వెంకట్రాయుడు. ఆమెకి మాట పెగల్లేదు.

"నీతో ఓ మాట చెప్పాలి. ఎక్కడ జూసినా లేవు. నీళ్లకొచ్చుంటావని ఒచ్చేను. కచ్చితంగా దొరికేవు."

లేవబోయింది సరమ్మ. ఆమె ఎదురుగుండా గొంతుక్కూచున్నాడు రాయుడు.

"కూచో మరి నిన్నంటుకోనిక్కడ. నాదో మాటి నాలి నువ్వు. మాటిని వెల్దూగాని," సిగరెట్టు వెలిగించి చీకట్లో ఆమెవేపు చూస్తూ మళ్లా అన్నాడతను.

"చూడూ నీతో పనిబడింది. పోన్లే బతిమాలుతున్నాననుకో. మా వోడు రాజమెండ్రి నుంచొచ్చాడు. చాలా మంచోడు, ఉజ్జోగం అదీ ఉందిలే. ఒస్తూ ఒస్తూ మందట్టుకొచ్చేడు. ఇంట్లో ఎవరూలేర్లే. రెండ్రోజులు రారు. నే నెప్పుడేనా ఇదివరకు గట్టిగా అడిగేనా, నిజం చెప్పు. నీ కలవాటయిన మూలాంచి అడుగుతున్నా. పదయింతరవాత రా, రేపు రాత్రి ఎనక తలుపు తీసే ఉంచుతా. ఉత్తినే ఒద్దు. యాభై ఇస్తాం. మేం ఇద్దరం ఉంటాం. ఒట్టేసి చెప్తున్నా. ఎవరికీ చెప్పను. ఇదుంచు. నువ్వు నమ్మవనీ." ఇరవై రూపాయల నోటు ఆమె చేతిలో కుక్కేడు రాయుడు.

"ఇరవై నోటు. ఇంటికెళ్లి చూసుకో. రేపు రాపోతే బాగా జరగదు మరి. నా పరువు పోద్ది. ముందే జెప్తున్నా. నిన్నేం జెయ్యను. రాకపోయినా ఒచ్చేవని అందరికీ జెప్తాను. నీ ఇష్టం," సరమ్మ చెయ్యి గట్టిగా నొక్కి పెద్దపెద్ద అంగలేసుకుంటూ వెళ్లిపోయాడతను.

ఆమె చేతిలో నోటు ఉండయిపోయింది. ఉత్త చేతుల్తో రాయుడి పీక పిసకాలనిపించింది. సముద్రమంత ఏడుపొచ్చింది సరమ్మకి. లేచి రాయుడు వెళ్లిన వేపు 'ఛూ' అని ఊసింది. నోటు చింపి బావిలో పడేసింది. సత్తు బిందె ఎత్తి శక్తికొద్దీ బావి గట్టుకేసి బాది, అలిసిపోయి కూచుండిపోయిందామె. కాస్త వెన్నెలొచ్చింది. చీకట్లో ఎంతసేపు కూచుండిపోయిందో ఆమెకే తెలియలేదు.

కాసేపటికి లేచి నుంచుందామె. ఊరి వేపు చూస్తూ కాలిదారి వెంట అడుగులేసింది. బాట ఒంపు తిరిగిన చోట ఆఖరిసారి చీకటి ఊరివేపు చూసి ముందుకు నడిచింది. తనకి బాషా ఇల్లు గుర్తుంది. రెడ్డి టీ కొట్టు వెనక. ఈ ఊళ్లో బతికే బదులు తనేవయినా పరవాలేదు. మసక వెన్నెట్లో బాట కడ్డంగా జరజర పాము పాకింది.

ఓ క్షణం ఆగి బాషా ఇంటివేపు నడిచింది సరమ్మ.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 24-30 మార్చి 1993*